ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 74 శనివారం 15-03-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసినా
# రూపాయి తేలేదు
### రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కెటిఆర్ విమర్శలు



**తొలి సమయం హైదరాబాద్,** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే ఢిల్లీ పర్యటనలు చేసినా రాష్ట్రానికి ఎటువంటి నిధులు తీసుకురాలేకపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం పదవి చేపట్టినప్పటి నుంచి రేవంత్ రెడ్డి మొత్తం 39 సార్లు ఢిల్లీకి వెళ్లినప్పటికీ, రాష్ట్రాభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోయారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ తీరు 'గల్లీలో హోదా మరిచి తిట్లు, ఢిల్లీలో చిట్‌చాట్లు' అన్నట్లు ఉందని, తన కార్యాలయం దాటి బయటకి రావడానికైనా తడబడే రేవంత్ ఢిల్లీలో మాత్రం మాటలతో కోటలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని సెటైర్ వేశారు. ఈ మేరకు ఇవాళ కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో పలు ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో సాగునీటి సమస్య తారాస్థాయికి చేరుకున్నా, పంటలు ఎండిపోతున్నా, రైతులు బిక్కుబిక్కుమంటూ విలవిలలాడుతున్నా సీఎం కనీసం సమీక్ష సమావేశం కూడా నిర్వహించకుండా ఢిల్లీకి వరుసగా పర్యటనలు నిర్వహించడం సరికాదని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత సంబంధాల గురించి తెలంగాణ ప్రజలకు ఎలాంటి అవసరం లేదని, మీ సంబంధం మీకే, దాని వల్ల తెలంగాణ ప్రజలకు ఏ మేలు జరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో మీ పార్టీకి ఓటు వేసి మోసపోయామని ఇప్పుడు గ్రామా గ్రామాన, గల్లీ గల్లీల్లో తీవ్ర అసంతృప్తితో బయటపడుతున్నారు. అయితే, ప్రజల వాస్తవ సమస్యలపై స్పందించాల్సిన సీఎం మాత్రం తమ బాధలను పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతూ రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'ముఖం బాగోలేక అద్దం పగలగొట్టినట్లు, పాలన చేయలేక పాతగ్జెలు మోగించినట్లు హామీలు అమలు చేయక, గాలిమాటలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు,' అంటూ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. చివరగా, 'జాగో తెలంగాణ జాగో' అంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని తన ట్వీట్‌లో పిలుపునిచ్చారు.

## ఫాంహౌస్‌ను గతంలోనే
# లీజుకు ఇచ్చా..
### కోడి పందేల గురించి తెలియదు
### పోలీసుల విచారణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి




**తొలి సమయం హైదరాబాద్,** ఫాంహౌసలో కోడి పందేలు, క్యాసినో నిర్వహించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డిని మొయినాబాద్ పోలీసులు విచారించారు. పోలీసస్టేషన్‌లో సుమారు నాలుగున్నర గంటల పాటు వివిధ అంశాలపై ఎమ్మెల్సీని ప్రశ్నించి వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అయితే తన ఫాంహౌసను గతంలోనే లీజుకిచ్చినట్లు.. అక్కడ కోడి పందేల గురించి తనకు తెలియదని ఆయన పోలీసులకు చెప్పారు. ఫిబ్రవరి 11న తోల్‌కట్టలోని ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి ఫాంహౌసలో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి 61 మందిని పట్టుకొని, 84 కోళ్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు శ్రీనివాసరెడ్డికి రెండోసారి నోటీసులు ఇవ్వగా ఆయన శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరయ్యారు. 'నా ఫాంహౌస్ వ్యవహారాలన్నీ మేనల్లుడు జ్ఞాన్‌దేవ్‌రెడ్డి చూసుకునే వారు. అయితే జ్ఞాన్‌దేవ్‌రెడ్డి ఆ భూమిని రమేశ్‌కుమార్‌రెడ్డికి కొన్నాళ్ల కింద కౌలుకు ఇచ్చాడు.. ఆ రమేశ్‌కుమార్‌రెడ్డి దాన్ని వెంకటపతిరాజుకు లీజుకు ఇచ్చాడు. ఈ విషయం నాకు తెలియదు. కోడి పందేల ఘటన జరిగిన రోజే జ్ఞాన్‌దేవ్‌రెడ్డి చెప్పాడు' అని శ్రీనివాసరెడ్డి పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే లీజు డాక్యుమెంట్లు చూపించమని పోలీసులు అడగ్గా గతంలోనే తన న్యాయవాదితో పంపానని, ఇప్పుడు మాత్రం తేలేదని శ్రీనివాసరెడ్డి చెప్పారు. దీంతో.. మళ్లీ ఎప్పుడు విచారణకు పిలిచినా రావాలని ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీకి సూచించారు. కేసు విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన కూడా బదులిచ్చారు.

## రేవంత్ రెడ్డిది
# దుష్టపాలన
### ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా
### సబితా ఇంద్రారెడ్డి విమర్శలు



**రంగారెడ్డి,మార్చి14:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్టపాలన కొనసాగిస్తున్నారని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించ కుండా చేయడానికి జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ చేయడం దారుణమని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడ్జెట్ సెషన్ పూర్తయ్యేదాకా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎక్కడ తప్పు మాట్లాడారో చెప్పకుండా జగదీశ్ రెడ్డిని ఎలా సస్పెండ్ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎక్కడ కూడా స్పీకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె మండిపడ్డారు.

# గ్రూప్-3 టాపర్లూ పురుషులే..
### టాప్-10లో ర్యాంకుల్లో 9 మంది వారె
### ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ.. 2,49,557 మంది జనరల్ ర్యాంకుల ప్రకటన
### అత్యధిక మార్కులు 339 (75.38)తో ప్రథమ ర్యాంకు సాధించిన అర్జున్‌రెడ్డి
### ఓఎంఆర్ షీట్లు నెల రోజులు ఆన్‌లైన్‌లో.. పారదర్శకంగా ప్రక్రియ: బుర్రా వెంకటేశం



**తొలి సమయం హైదరాబాద్,** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పోటీ పరీక్షల ఫలితాల్లో పురుషుల హవా కొనసాగుతోంది. గ్రూప్-3 పరీక్ష ఫలితాల్లోనూ వారే టాపర్లుగా నిలిచారు. గతేడాది నవంబరు 17, 18వ తేదీల్లో నిర్వహించిన గ్రూప్-3 ఫలితాలను టీజీపీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 1388 పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా 2,67,921 మంది అన్ని (3) పేపర్లకు హాజరయ్యారు. వీరిలో 18,364 మందిని ఇన్‌వ్యాలీడ్‌గా ప్రకటించారు. మిగతా 2,49,557 మంది జనరల్ ర్యాంకింగ్ వివరాలను కమిషన్ విడుదల చేసింది. అలాగే టాప్-10 జనరల్ ర్యాంకులు, టాప్-10 మహిళా ర్యాంకులను విడుదల చేశారు. టాప్-10 జనరల్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిది మంది పురుషులుండగా, ఒక్కరే మహిళ ఉన్నారు. మొత్తం 450 మార్కులకుగాను 339.239 (75.38 శాతం) మార్కులు సాధించి కుకునూరి అర్జున్‌రెడ్డి టాపర్‌గా నిలిచారు. గత జనవరిలో ఈ పరీక్ష ప్రిలిమనరీ కీ విడుదల చేయగా.. అందులో అభ్యర్థుల నుంచి స్వీకరించిన అభ్యంతరాలపై నిపుణుల అభిప్రాయాలు సేకరించామని టీజీపీఎస్సీ తెలిపింది. జనరల్ ర్యాంకింగ్స్ నుంచి అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తామని కమిషన్ కార్యదర్శి పేర్కొన్నారు. కాగా, గ్రూప్-3 పరీక్ష, సమాధాన పత్రాల పరిశీలన, ఫలితాల వెల్లడిని అత్యంత పారదర్శకంగా నిర్వహించామని కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. పరీక్ష రాసిన అభ్యర్థుల మాస్టర్ క్వశ్చన్ పేపర్‌తోపాటు ఓఎంఆర్ షీట్లను వ్యక్తిగత లాగిన్‌లో అందుబాటులో ఉంచామని, వీటిని ఏప్రిల్ 12 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. వెబ్‌సైట్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ పనివేళల్లో ఫోన్ 040-23542185, 23542187 నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

**గ్రూప్-2లో 18వ ర్యాంకు.. గ్రూప్-3లో టాపర్**

పాపన్నపేట: గ్రూప్-3 ఫలితాల్లో 339.239 మార్కులతో టాపర్‌గా నిలిచిన కుకునూరి అర్జున్‌రెడ్డి.. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లోనూ 18వ ర్యాంకు సాధించారు. తండ్రి నరేందర్‌రెడ్డి గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తుండగా.. అర్జున్‌రెడ్డి అదే గ్రంథాలయంలో పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలానికి చెందిన అర్జున్‌రెడ్డి పదో తగరతి వరకు మెదక్‌లోని సరస్వతీ శిశు మందిర్‌లో చదివారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో, 2013లో బీటెక్ పూర్తి చేశారు. 2014లో వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యారు. పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం మెదక్ కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కాగా, చిన్నప్పటి నుంచి కలెక్టర్ కావాలని ఉందని, ఆ మేరకే గ్రూప్స్ వైపు అడుగులు వేశానని అర్జున్‌రెడ్డి తెలిపారు.

## 15 నుంచి ఒంటిపూట బడులు

**హైదరాబాద్,మార్చి13:** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి జనం జంకుతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం పాఠశాలల సమయంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో హాఫ్‌డే స్కూల్స్‌పై అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారని చెప్పింది. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలకు హాఫ్ డే ఉంటుందని.. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## చట్టసభలంటే విలువ లేని
# బిఆర్ఎస్
### స్పీకర్‌నే నిందించి...నిరసనలు చేయడమా...
### బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం..



**తొలి సమయం హైదరాబాద్,** చట్టసభల్లో ప్రజాస్వా మ్యానికి సభకు నాయకుడు ముఖ్యమంత్రి అయితే, సభ మొత్తానికి అధిపతి స్పీకర్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అటువంటి స్పీకర్ ని పట్టుకొని సభ మీ ఒక్కడిది కాదు అని మాట్లాడడం ప్రజాస్వా మ్యానికి వ్యతిరేకమే గాకుండా మొత్తం సభనే అవమానించడం అని మంత్రి అన్నారు. స్పీకర్ మళ్ళీ అవకాశం ఇచ్చి పొరపాటు అం టుంటే కూడా సరిదిద్దుకోకుండా ..సభ మీది కాదు అని మాట్లాడిన జగదీశ్ రెడ్డి ముమ్మాటికి శిక్షార్హుడని అన్నారు. ఇంతచేసి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు అని ఆయన మండిపడ్డారు. ఇవన్నీ గమనిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వం కూడా జగదీశ్వర్ రెడ్డి చేసింది తప్పు.. స్పీకర్ ని సభలో ఇలా మాట్లాడడం మంచిది కాదని చెప్పడం లేదంటే వారికి సభ పట్ల ఎంత గౌరవం ఉందో తెలుస్తుందని అన్నారు. అడ్డంగా సభావేదికగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, ధర్నాలు చేయడం ప్రజాస్వా మ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్ళే ఈరోజు నిరసనలు తెలుపుతున్నారు అంటూ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రాష్ట్రంలో నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వం హాస్యాస్పదం అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం అయినా బీఆర్ఎస్ పార్టీకి రావాలి అని పేర్కొన్నారు. సభలో ఏ విధంగా ఉండాలి సభ వేదికపై ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా ఇలా చేస్తున్నారంటే ఇది ఉద్దేశ్యపూ ర్వకంగా చేస్తున్నారని అనేది అర్థం అవుతుంద న్నారు. ఇది ప్రజలు గమనించాలి.. సభకు కొన్ని సంప్రదాయాలు పద్ధతులు ఉంటాయన్నారు. దళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారని మాట్లాడుతు న్నారు.. ఇదే బీఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించి బర్తరఫ్ చేశారు.. ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా?.. ఇటువంటి మాటలు, నిరసనలు వద్దు ఎందుకంటే ఇది బీఆర్ఎస్ కి మంచిది కాదని పొన్నం సూచించారు.



## విదేశీ ఉపగ్రహాల ప్రయోగాలతో
# 1,243 కోట్ల ఆర్జన

న్యూఢిల్లీ, మార్చి 14: అంతరిక్ష ప్రయోగాల్లో వరుస విజయాలు సాధిస్తున్న భారత్... వాణిజ్యపరంగానూ భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. గత పదేళ్ల కాలంలో 34 దేశాలకు చెందిన విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా రూ.1243 కోట్ల (143 మిలియన్ డాలర్లు) విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. 2015 జనవరి నుంచి 2024 డిసెంబరు వరకు వాణిజ్య ప్రాతిపదికను మొత్తం 393 విదేశీ ఉపగ్రహాలు, 3 భారత కస్టమర్ ఉపగ్రహాలను ప్రయోగించినట్టు లోక్‌సభలో తెలిపారు.

భారత్ ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల్లో అభివృద్ధి చెందిన దేశాలకు చెందినవి కూడా ఉన్నాయని వివరించారు. అత్యధికంగా అమెరికాకు చెందిన 232 ఉపగ్రహాలను పంపగా, ఆ తర్వాత ఇంగ్లండ్ (83), సింగపూర్ (19) దేశాలకు చెందిన ఉపగ్రహాలు ఉన్నాయి. ప్రస్తుతం 61 దేశాలు, 5 బహుళ జాతి సంస్థలతో భారత్ అంతరిక్ష సహకార ఒప్పందాలు చేసుకుంది.

# వామ్మో!డేంజర్ లేడీ

**పిల్లలను మత్తుకు బానిసగా మారుస్తున్న ఆ కిలాడీ లేడీ కొంతమందితో**

**ముఠాగా ఏర్పడి ఈ బాగోతానికి పాల్పడుతుండగా వరంగల్ మిల్స్ కాలనీ పోలీసులు అదుపులోకి ...**



**తొలి సమయం హన్మకొండ మార్చి14:**
ప్రాథమిక సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ వరంగల్ మిల్స్ కాలనీ సమీపంలో ఉంటోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసైన ఆమె, తనతోపాటు డ్రగ్స్ కు అలవాటు పడిన మరో అమ్మాయి, నలుగురు యువకులతో కలిసి ఓ ముఠాగా ఏర్పడింది. దీంతో వారంతా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడంతో పాటు మరికొందరినీ వాటికి అలవాటు చేయడం మొదలుపెట్టారు.

**స్కూల్ పిల్లలే టార్గెట్**
వరంగల్‌కు చెందిన వీరంతా ఒక ముఠాగా ఏర్పడిన వాళ్లంతా పాఠశాల బాలికలను లక్ష్యంగా చేసుకున్నారు. అనంతరం గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి మెల్లిగా పాఠశాల బాలికలకు అలవాటు చేయడం మొదలు పెట్టారు. తమ ప్లాన్ లో భాగంగా ఆ కిలాడీ లేడీ వరంగల్ నగరంలోని సంపన్నుల కాలనీలు, కార్పొరేట్ పాఠశాలల వద్ద రెక్కీ నిర్వహించేది. పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో ముందుగా తాము ఎంపిక చేసుకున్న బాలికలతో మాటలు కలిపి, వారికి దగ్గరయ్యేది. ఆ తరువాత బాలికలను మెల్లిగా గంజాయి చాక్లెట్లు, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు చేసేది. ఆ తరువాత వారిని కిడ్నాప్ చేసి, బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి, అప్పటికే తన గ్యాంగ్ కు టచ్ లో ఉన్న కస్టమర్లకు అప్పగించడం చేస్తోంది. ఆ తరువాత బాలికలు స్పృహలోకి రాగానే వారిని ఎక్కడి నుంచి తీసుకెళ్లారో.. తిరిగి అక్కడే వదిలేసేది. ఇలా ఆ కిలాడీ లేడీ తన గ్యాంగ్ తో కలిసి ఏడాదిన్నరగా బాలికలను ట్రాప్ చేసి, చీకటి దందా చేస్తున్నట్టు తెలిసింది.

**బాలిక మిస్సింగ్ తో వెలుగులోకి..**
ఏడాదిన్నర కాలంగా సదరు మహిళ బాలికలను ట్రాప్ చేసి, డ్రగ్స్ కు బానిసలుగా మారుస్తుండగా.. అనూహ్యంగా ఓ బాలిక కిడ్నాప్ కావడం, తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో అసలు గుట్టు బయట పడింది. వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక రెండు రోజుల కిందట కనిపించ కుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత బాలిక మగతగా ఇంటికి చేరగా.. తల్లిదండ్రులు బాలికను విచారించారు. దీంతో తనను ఓ మహిళ కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఆ తరువాత తనకేం జరిగిందో తెలియదని చెప్పింది. తాను స్పృహలోకి వచ్చాక వదిలేసి వెళ్లారని ఏడ్చుకుంటూ వివరించింది. దీంతో విషయాన్ని తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. బాలిక చెప్పిన వివరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. అసలు తతంగం బయటపడింది. దీంతో మిల్స్ కాలనీ పోలీసులు సదరు కిలాడీ లేడీని గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆమె చెప్పిన వివరాల ప్రకారం మరో ఇద్దరిని కూడా విచారణ జరుపుతున్నట్టు సమాచారం. కాగా దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

# బోధగయ - మహాబోధిని రక్షించుకుందాం

**బుద్ధ విహార్ బౌద్ధులచే నిర్వహించాలి**

**అంబేద్కర్ యువజన యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య**




**తొలి సమయం హన్మకొండ మార్చి 14 :**
బోదగయ-మహాబోధి బుద్ధవిహార్ ను బౌద్ధులచే నిర్వహించాలని, బిటి ఆక్ట్ 1949 ని రద్దు చేయాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుపాక ఎల్లయ్య డిమాండ్ చేశారు. బోధగయను రక్షించి బుద్ధ విహార్ ను రక్షించే పూర్తి బాధ్యత బౌద్ధ బిక్షువులకే ఇవ్వాలని బోధగయలో పోరాటం చేస్తున్న బౌద్ధ బిక్షివులకు సంఘీభావంగా హనుమకొండ జిల్లా కేంద్రం, అంబేద్కర్ సెంటర్ గౌతమ బుద్ధ విగ్రహ ప్రాంగణం నందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నిరసన ధర్నా లో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్ధార్థుడు బోధి వృక్షం కింద ధ్యానం చేసి జ్ఞానోదయం పొందిన బుద్ధగయ లోని ప్రాంతంలో బౌద్ధ వ్యవహారాలను బీటీ యాక్ట్ 1949 ఏర్పాటు చేసుకొని బౌద్ధ సాంప్రదాయాలను కొనసాగిస్తూ ఉన్నారని అందులో నలుగురు బ్రాహ్మణులు నలుగురు బంతేలు ఒక కలెక్టర్ సభ్యులుగా ఉండి బౌద్ధ వ్యవహారాన్ని కొనసాగిస్తున్న ప్రాంతంలో ప్రస్తుతం బ్రాహ్మణులే బౌద్ధ వ్యవహారాలను కొనసాగించాలని ఒక కుట్రపూరితంగా బంతేజీలకు ఇబ్బందులను కలిగిస్తున్నారని అన్నారు. జాతీయ సమైక్యతలో భాగంగా ఎవరి మతాన్ని వారు నిర్వహించుకోవడానికి స్వేచ్ఛను కల్పించాలని నిరసన ధర్నాలు చేస్తున్న బౌద్ధ భిక్షువులకు సంఘీభావంగా ప్రగతిశీలవాదులు, ప్రజా సంఘాల వారు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బుద్ధ గయను రక్షించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు నివేదించనున్నట్లు తెలిపారు. ధర్నాను ఉద్దేశించి ఆదివాసి ఉద్యమకారులు సోమ రామమూర్తి మాట్లాడుతూ లౌకిక భారతదేశంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛ సమానత్వం ఉన్నప్పుడు, ప్రతి మతాన్ని గౌరవించినప్పుడే భారత రాజ్యాంగం వర్ధిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుట్ల రవీందర్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డాక్టర్ నవీన్, బిఎల్ఎఫ్ నాయకులు ఇతం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాసరి మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి
# చేసిన సేవలు మరువలేనివి

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి**

**తొలి సమయం తొర్రూరు మార్చి 14**



కుర్రోడు మండల కేంద్రానికి చెందిన దాసరి మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రవీందర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఝాన్సీ రెడ్డి శుక్రవారం సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దాసరి మల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి మల్లయ్య తొర్రూరు ఉప సర్పంచ్ గా, డిసిసి ప్రధాన కార్యదర్శిగా, పిఎసిఎస్ వైస్ చైర్మన్, చైర్మన్ గా, పిసిసి సభ్యులుగా సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి అనేకమంది యువకులను ప్రోత్సహించి రాజకీయ ప్రజాసేవలు అందించిన వ్యక్తి దాసరి మల్లయ్య అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కాంగ్రెస్ నాయకులు మరువలేనని అన్నారు. సీనియర్ నాయకులు, పట్టణ నాయకులు, యువజన నాయకులు, తదితరులు, ఉన్నారు.

## హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న
## జలగం కుమార్‌ను పరామర్శించిన
# పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొర్రూరు తొలి సమయం మార్చి 14**
పాలకుర్తి మండలం దర్థపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలగం కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని మెడిసిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఈరోజు హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జలగం కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. ఏ విధమైన సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటాను" అని వారు అన్నారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యంతో సమావేశమైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జలగం కుమార్ మెరుగైన వైద్యం అందించాలని, అత్యున్నత చికిత్స అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. తగిన అన్ని వైద్య సదుపాయాలు అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.

## 53 కేజీల బంగారం తుప్పు పట్టేస్తుంది..
# మా నగలు మాకిచ్చేయండి..

**తొలి సమయం, డెస్క్ మార్చి 14:**



ఓఎంసీ కేసులో భాగంగా తమ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న 53 కిలోల బంగారు నగలు తుప్పుపట్టిపోతాయంటూ గాలి జనార్దన్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నగలతో పాటు తమ వద్ద సీజ్ చేసిన నగదు, రూ.5 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమార్తె జి బ్రాహ్మణి, కుమారుడు జి కిరీటిరెడ్డి పిటిషన్లు దాఖలు చేయగా, తెలంగాణ హైకోర్టు వాటిని కొట్టేసింది. బంగారు నగలు తుప్పుపట్టిపోతాయని, విలువ తగ్గుతుందన్న గాలి అభ్యర్థనను తిరస్కరిం చింది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే వాటిపై హక్కులు తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా రూ.884.13 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదుచేసి, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఈడీ కూడా హక్కులు కోరుతోందని, అందువల్ల ఈ దశలో సీజ్ చేసిన వాటిని అప్పగించాలని ఉత్తర్వులు ఇవ్వలేమంది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే నగలను, సొమ్మును తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చంది.

# హైదరాబాద్ ధూల్‌పేట్‌లో గంజాయి కలకలం

**ఐస్‌క్రీమ్‌లు, స్వీట్ల ముసుగులో గంజాయి అమ్మకాలు**






**తొలి సమయం హైదరాబాద్ మర్చి 14:**
హెూలీ సందర్భంగా విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు కొనసాగి నట్టుగా సమాచారం,కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లో గంజాయి బాల్స్ కలిపి సరఫరా చేసినట్టు తెలుస్తోంది. పోలీసుల అదుపులో సత్యనారాయణ్ సింగ్ అనే వ్యక్తి ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారం వివరాలు తెలువనున్నాయి

# గోటి తలంబ్రాలతో భద్రాచలానికి పాదయాత్ర

**శ్రీరామ జయరామ జయ జయ రామ**






**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 13**
సుజాతనగర్ మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవిద(చెన్నకేశవ స్వామి ఆలయం) కేశవాపురం సిరిపురం గ్రామాల భక్త బృందం ఆధ్వర్యంలో భక్త బృందం సేవాసమితి వారు నెల రోజుల పాటు గోటితో ఒలసిన తలంబ్రాలను భక్తులు తలపై పెట్టుకుని గురువారం ఉదయం పాదయాత్రగా సుజాతనగర్ నుండి భద్రాచలం బయల్దేరారు. భద్రాచలం రామాలయానికి చేరుకున్న తర్వాత సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ వారికి గోటి తలంబ్రాలు అందజేసి సీతారామచంద్రస్వామి దర్శనం చేసుకొనున్నట్లు భక్తులు వెల్లడించారు. భక్తులుసీతారామచంద్రస్వామి జెండాలను పట్టుకొని తలపై గోటి తలంబ్రాలను పెట్టుకొని ప్రధాన రహదారి వెంట సీతారామ చంద్రస్వామికి జై అంటూ నినాదాలు చేస్తూ. బయలుదేరారు దాంతో రహదారి పక్కన ఉన్న వారితో పాటు ప్రయాణికులు సైతం ఆగి విజయంగా పాదయాత్ర పూర్తి చేయాలని తమ సంఘీభావం తెలియజేస్తున్నారు ఈ యొక్క కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హెూలీ సంబరాలు జరుపుకున్న
# దంతాలపల్లి యూత్ అధ్యక్షుడు

**తొలి సమయం, దంతాలపల్లి మార్చి 14**



దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సంపేట సురేష్ గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ సంపేట రామ గౌడ్ హెూలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డోర్నకల్ శాసనసభ్యుడు ప్రభుత్వ రామచంద్రనాయక్ కు హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వానకొండయ్య లక్ష్మీ నరసింహస్వామికి తలంబ్రాలు సమర్పించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం తొర్రూరు మార్చి 14**
దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వానకొండయ్య శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి మరియు గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తాం అని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. అలాగే, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచుతాయి. సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవడానికి ఇలాంటి ఉత్సవాలు చాలా అవసరం" అని అన్నారు.గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు వేడుకను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, మహిళ నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# దేశం కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధం

**- ఉత్తర,దక్షిణ పేరుతో విడదీయడం సరికాదు**

**- హిందీపేరుతో రాజకీయాలు మంచివి కావు - జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్**

**పిఠాపురం,మార్చి14:** కుహనా సెక్యులరిస్టులకు పవన్ ఘాటు హెచ్చరికలు చేశారు. ఓట్ల కోసం చేసే రాజకీయాలక కాలం చెల్లిందన్నారు. మతం ఏదైనా అందరికీ ఒకటటే ధర్మం ఉంటుందన్నారు. ఒక మతాన్ని కించపర్చడం సరికాదన్నారు. హిందూమతాన్ని కించపర్చడం..దానిని సమర్థించడం సెక్యులరిజం కాదన్నారు. మతానికో న్యాయం అంటే కుదరదు.. అందరికీ ధర్మం ఒక్కటేనని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం శివారులోని చిత్రాడలో జరిగిన 'జయకేతనం' సభలో పవన్ ప్రసంగించారు. 'ఇతర మతాలను గౌరవించాలని సనాతన ధర్మం మాకు నేర్పింది. సెక్యులరిజం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. తప్పు ఎవరు చేసినా తప్పని గట్టిగా చెప్పండి.. మతాల ప్రస్తావన వద్దు. ఇప్పుడు మనం వేసింది తొలి అడుగు మాత్రమే. భారతదేశం కోసం చనిపోవడానికైనా సంసిద్ధంగా ఉన్నా. నా ఇంటెన్సిటీ చాలా వైల్డ్‌గా ఉంటుంది. మాట్లాడితే సంస్కృతాన్ని తిడతారు. దక్షిణాదిపై హిందినీ రుద్దుతున్నారంటారు. అన్నీ దేశ భాషలే కదా. తమిళనాడు లో హిందీ రాకూడదని అంటుంటే.. నాకు ఒకటే అనిపించింది. తమిళ సినిమాలు హిందీలో డబ్ చేయకండి. డబ్బులేమో ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్ నుంచి కావాలి. హిందీని మాత్రం ద్వేషిస్తామంటే ఎలా? ఇదెక్కడి న్యాయం. ఉత్తరాది, దక్షిణాది భేదాలు కాదు.. దేశ సమగ్రత కావాలి. కట్ చేయడానికి భారతదేశం కేక్ కాదు. ఉత్తరాదిన హిమాలయాల్లో ఉంది పరమశివుని కైలాసం. దక్షిణాదిన ఉన్నది ఆయన కుమారుడు కుమారస్వామి మురుగన్ నివాసం. ఈ దేశాన్ని విడగొట్టే ధైర్యం, సాహసం ఎవరికైనా ఉందని నేను అనుకోవడం లేదు' అని పవన్ అన్నారు. ఇప్పటికే దేశాన్ని ముక్కలు చేశారు. దేశ విభజన గురించి చాలామందికి తెలియదు. నాదేశం గురించి నేను మాట్లాడితే తప్పంటారా అని ప్రశ్నించారు. తన గురించి ఓ ఇంగ్లీష్ పత్రికలో వచ్చిన వ్యాసాన్ని ప్రస్తావిస్తూ...తానెక్కడా మారలేదన్నారు. 11 ఏళ్లుగా తన పోరాటంలో ఎక్కడా తప్పటడుగు లేదన్నారు.

# నోరు అదుపులో పెట్టుకోకుంటే జగన్‌కు పట్టిన గతే

**- కనీసం ప్రతిపక్షహోదా కూడా దక్కలేదు - ప్రజల సంక్షేమమే పవన్ కళ్యాణ్ లక్ష్యం**

**- రాబోయే 20 ఏళ్లలో ఏపి స్వర్ణయుగం సాధిస్తుంది - పిఠాపురం జనసేన జయకేతన సభలో నాగబాబు**

**పిఠాపురం,మార్చి14:** పిఠాపురం ప్రజలు, జన సైనికులకు రుణపడి ఉన్నామని జనసేన ముఖ్యనేత, ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబు అన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన 'జయ కేతనం' సభలో నాగబాబు మాట్లాడుతూ.... 'నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఏం జరుగుతుందో చూశాం. నోటిదురుసు ఉన్న నేతకు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. రాజకీయాల్లో జాగ్రత్తగా మాట్లాడాలని పవన్ చెప్పారు. జగన్ లాంటి హాస్యనటులు ఎన్నో కలలు కన్నారు. మరో 20 ఏళ్ల వరకు జగన్ కలలు కంటూనే ఉండాలని నా సలహా అంటూ చలోక్తులు విసిరారు. జనసేన నేతలు, కార్యకర్తలు, వీర మహిళలకు జనసేన 12వ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.అధికారం వచ్చింది కదా అని నేతలెవరూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని సలహా ఇచ్చారు. పవన్ కల్యాణ్ క్రమశిక్షణ కలిగిన నేత. 12 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఆయన ఎదుర్కొన్నారు. పిఠాపురంలో ఘన విజయం సాధిస్తామని పవన్‌కు ముందే తెలుసు. రాబోయే 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణయుగం చూడబోతోంది. పదవులు వచ్చినా, రాకపోయినా ఆయనకు సేవలు చేస్తాం. ప్రజలు బాగోగులు చూసే వ్యక్తి పవన్. అడగకుండానే వరాలు ఇచ్చేది వ్యక్తి పవన్. జనసేనకు ప్రాణవాయువు కార్యకర్తలు, వీర మహిళలు. పవన్‌లా గొప్ప వ్యక్తి కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలని' చెప్పారు.ప్రజల బాగోగులు చూసే వ్యక్తి పవన్ కల్యాణ్. అలాంటి ఒక గొప్ప వ్యక్తిగా కావాలి.. లేకుంటే ఆయనకు అనుచరుడిగా ఉండాలి. వచ్చే రెండు, మూడు తరాల గురించి ఆలోచించే వ్యక్తి పవన్. దేవుడు అడిగితేనే వరాలిస్తాడు.. కానీ, ఆయన అడగకుండానే వరాలిస్తారు. నాకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చిన పవన్‌కు కృతజ్ఞతలు. జనసైనికుడిని అని చెప్పుకొనేందుకు గర్వ పడుతున్నా. పిఠాపురంలో పవన్ విజయానికి తానే కారణమని ఎవరైనా అనుకుంటే అది వారి కర్మ' అని నాగబాబు అన్నారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా 12 ఏళ్ల జన సేన ప్రస్థానంపై ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని వేదికపై ప్రదర్శించారు. జనసేన పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు భారీగా తరలివచ్చారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తల కోసం ప్రత్యేక గ్యాలరీలను పార్టీ వర్గాలు ఏర్పాటు చేశాయి. ఒక్కో గ్యాలరీలో సుమారు 2,500 మంది కూర్చొనేలా సిద్ధం చేశారు. అయినా భారీగా కార్యకర్తలు తరలిరావడంతో సభా ప్రాంగణం బయటే పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు నిలిచిపోయారు.

# బిఆర్ఎస్‌కు అధికార మత్తు వీడలేదు

**- అందుకే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు - మండిపడ్డ పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్**

**పెద్దపల్లి,మార్చి14:** ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినప్పటి కీ కూడా ఆపార్టీ లీడర్లకు ఇంకా అహంకారం తగ్గలేదని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వా మి అన్నారు. వారి తీరు చూస్తుంటే ఇంకా అధి కారంలోనే ఉన్నామనే భ్రమలోనే ఉండి ఇష్టా రాజ్యాంగ మాట్లాడుతున్నారని విమర్శించారు. స్పీకర్ పదవిలో ఉన్నవారిని గౌరవించడం మన అందరి బాధ్యతని గుర్తుచేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్ రావు పేట్ లోని శ్రీ మల్లికార్జున స్వామి, దొంగతుర్తిలో వెంకటేశ్వర స్వామి వార్లను ధర్మపురి ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ 'స్పీకర్ పదవిలో ఉన్న వారిని అగౌర వపరిస్తే సస్పెండ్ చేసుడు న్యాయమే. రాష్ట్రరా జకీయాలను నాశనం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే ప్రజలు ఓడించారు. నిన్నఅసెంబ్లీలో దళితుడైన స్పీకర్ పై మాట్లాడిన తీరు దళితలపై మీ వ్యతిరేకత కనిపించింది. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఉంది' అని తెలిపారు. 'గోపాల్ రావు పేట గ్రామంతోమా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. మీరు చూపే ప్రేమ మరువలేనిది. నేను ఎంపీగా ఉన్న రోజుల్లో ఇక్కడ బ్రిడ్జి మంజూరు చేయించా. గ్రామస్తుల కోరిక మేరకు విశాఖ ట్రస్ట్ నుంచి పాఠశాలల విద్యార్థులకు బెంచీలు అందించాం' అని వివేక్ తెలిపారు. అనంతరం ఇటీవల వివాహం జరిగిన పెద్దపల్లి పట్టణానికి చెందిన భూషణ్వేనా రమేష్ గౌడ్ కూతురు, అల్లుడిని ఆశీర్వదించారు. అలాగే పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలువక రాజయ్య ఏర్పాటు చేసిన లంచ్ కు హాజరయ్యారు.

# నటి రన్యారావుకు చుక్కెదురు

**బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన కోర్టు**

**బెంగళూరు,మార్చి14:** కన్నడ నటి రన్యారావుకు చుక్కెదురయ్యింది. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకువస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కన్నడ నటి రన్యారావు కు చుక్కెదురైంది. ఆమె బెయిల్ అభ్యర్థనను ఆర్థిక నేరాల విచారణ కోర్టు శుక్రవారంనాడు తోసిపుచ్చింది. ఈ కేసులో రెండో నిందితుడైన తరుణ్ కొండూరు బెయిల్ అభ్యర్థను శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కోర్టు విచారించ నుంది. మార్చి 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రన్యారావును డీఐర్ఐ అధికారులు అదుపులోనికి తీసుకున్నారు. ఆమె నుంచి రూ.12.56 కోట్ల అక్రమ బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెయిలు కోరుతూ ఆమె దాఖలు చేసుకున్న పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుగగా, ఆమెకు బెయిల్ ఇవ్వరాదని కోర్టును డీఆర్ఐ కోరింది. బెయిలుపై ఆమెను విడుదల చేస్తే ప్రస్తుతం జరుగుతున్న విచారణకు అవరోధం కలుగుతుందని, సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని వాదించింది.డీఆర్ఐ విచారణలో తన పట్ల అధికారులు అనుచితంగా ప్రవర్తించారని, మానసికంగా వేధిం చారని, బెదిరించారని రన్యారావు ఇటీవల కోర్టు విచారణలో ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను డీఆర్ఐ తోసిపుచ్చింది. రన్యారావును అదుపులోకి తీసుకున్నప్పుడు, విచారణ జరిపినప్పుడు రికార్డు చేశామని, తెలిపింది.

# సుజాతనగర్‌లో ఘనంగా హెూలీ సంబరాలు

**హెూలీ అందరి జీవితాల్లో రంగులు నింపాలి**

**టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**



**తొలి సమయం భద్రాద్రి కొత్త గూడెం మర్చి 14:**
పండగ వేళ టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగులు చల్లుతూ హెూలీ పండగ సంబరాలలో మునిగిపోయారు. హెూలీలో సాంప్రదాయ రంగులు పూసుకున్నారు. ఈ హెూలీ పండుగ అందరి జీవితాల్లో రంగులు నిండాలని వారి జీవితాలు రంగుల మాయం కావాలని ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రజాపాలనలో విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ పై**

**నిరసన వ్యక్తం చేసిన రామకృష్ణాపూర్ బిఆర్ఎస్ నాయకులు..**

**రామకృష్ణాపూర్, మార్చ్ 14**
ప్రస్తుతం ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బిఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ రాజా రమేష్ విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ పై నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం స్థానిక రాజీవ్ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజరమేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు పరచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీ స్పీకర్ కి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని, ప్రజల సమస్యలను అసెంబ్లీలో గళం వినిపిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ హవా చూపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, నాయకులు బడికల సంపత్, రామిడీ కుమార్, పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదేలు, ఆలుగుల సత్తయ్య, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జన్మతఃపౌరసత్వం రద్దు వ్యవహారం

**ఫెడరల్ కోర్టు తీర్పుపై సుప్రీంకు ట్రంప్**

**వాషింగ్టన్,మార్చి14:** జన్మతః పౌరసత్వం రద్దుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. తాజాగా తన ఆదేశాలను ఫెడరల్ కోర్టులు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యాక్టింగ్ సొలిసిటర్ జనరల్ సారా హారిస్ ఈ పిటిషన్ సాధారణమైనదని అభివర్ణించారు. మూడు దిగువ కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను వ్యక్తిగత స్థాయికే పరిమితం చేయాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. అంతేగాక, ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగబద్ధమా..?కాదా..?అన్న విషయంపై అభిప్రాయాన్ని మాత్రం కోరలేదు. ట్రంప్ జారీ చేసిన ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నాయి. మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో పిటిషన్లు దాఖలు కావడంతో కోర్టులు ఇంజెక్షన్ ఆర్డర్లు జారీ చేశాయి. ఈ ఆదేశాలు దేశ ఎగ్జిక్యూటివ్ విభాగాన్ని రాజ్యాంగపరమైన విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇటీవల ట్రంప్ సర్కారు తొలగించిన పలువురు ప్రొబేషనరీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆరు ఏజెన్సీలకు కాలిఫోర్నియాలో న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టినవారికి మాత్రమే కాకుండా.. అమెరికాలో జన్మించిన ప్రతిఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరికా గడ్డపై పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటివరకు ఈ పక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది.

# బిజెపి బలపడడంతో కుట్రలు

**డీలిమిటేషన్ ఆందోళన అందులో భాగమే**

**మండిపడ్డ బిజెపి ఎంపి లక్ష్మణ్**

**న్యూఢిల్లీ,మార్చి14:** దక్షిణాది పేరుతో కొందరు ర ఆజకీయం చేస్తున్నారని బిజెపి ఎంపి లక్ష్మణ్ మండిపడ్డారు. డీలిమిటేషన్ పేరుతో రాజకీయాలకు తెరతీసారని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా బిజెపిపై కాంగ్రెస్ కుట్రలకు తెర లేపిందని లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నగరంలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ దక్షిణాదిలో బీజేపీ శరవేగంగా బలపడుతోందని.. అందుకే డీలిమి టేషన్ పేరుతో తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే దేశ వ్యాప్తంగా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్వి భజనతో ఎలాంటి నష్టం ఉండదని, ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారో వారికే తెలియాలని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# హెూలీ సందర్భంగా నగరంలో బందోబస్తు

**స్వయంగా పరిశీలించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్ మార్చ్ 14 :**
హెూలీ పండుగ సందర్భంగా కరీంనగర్ నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో శుక్రవారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పర్యటించారు. నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రార్థన మందిరాలు, ప్రధాన కూడళ్ళ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన స్వయంగా పరిశీలించారు. కమిషనరేట్ ప్రజలందరికీ కరీంనగర్ పోలీస్ శాఖ తరపున పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## రైలు హైజాక్ ఉగ్రవాదుల
# వెనక భారత్ హస్తం

**పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్**

**ఉగ్రవాదమే పాక్ మూలమని ప్రపంచానికి తెలుసని వెల్లడి**

**న్యూఢిల్లీ,మార్చి14:** బలోచిస్థాన్ రైలు హైజాకింగ్‌లో భారత్ పాత్ర ఉందొచ్చంటూ పాక్ విదేశాంగ శాఖ చేసిన ఆరోపణలపై భారత్ ఘాటుగా స్పందించింది. తన సమస్యలకు పొరుగువారిని బాధ్యుల్ని చేసే ప్రయత్నం మానుకోవాలని మండిపడింది. 'పాక్ చేసిన నిరాధార ఆరోపణలను మేము తిరస్కరిస్తున్నాము. ప్రపంచంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మూలం ఎక్కడుందో ప్రపంచానికి అంతటికీ తెలుసని హెచ్చరించింది. ఎదుటి వారిపై నెపం నెట్టి బాధ్యుల్ని చేసే బదులు పాక్ ఆత్మపరిశీలన చేసుకోవాలని భారత్ ఘాటుగానే స్పందించింది. తన అంతర్గత సమస్యలకు, వైఫల్యాలకు ఇతరులు కారణమని అనడం మానుకోవాలని విదేశాంగ శాఖ రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. హైజాకింగ్ ఘటనపై పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పందించారు. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాదులు ఆఫ్ఘనిస్థాన్‌లోని తమ లీడర్లతో టచ్‌లో ఉన్నారని అన్నారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలను ఆఫ్ఘాన్ భూభాగంలో అనుమతించరాదని అక్కడి వారికి తాము గతంలో అనేకసార్లు స్పష్టం చేసినట్టు కూడా పేర్కొన్నారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న పాత్రధారులు సూత్ర దారులు అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా తమకు సహకరించాలని ఆఫ్ఘాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విలేకరులు భారత్ ప్రస్తావన తెచ్చారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలకు గతంలో భారత్‌ను నిందించే పాక్ విధానంలో ఏమైనా మార్పు వచ్చిందా అని అన్నారు. దీనిపై పాక్ ప్రతినిధి స్పందిస్తూ తమ విధానంలో మార్పు ఏమీ లేదని అన్నారు. 'వాస్తవాల్లో మార్పు ఏమీ లేదు. పాక్‌పై ఉగ్రవాదం ఎగదోయడం వెనక భారత్ ఉంది. ఈ ఘటనలో మాత్రం కాల్ డాటా ఆఫ్ఘానిస్థాన్ పాత్ర సూచిస్తోంది. మేము అది మాత్రమే అన్నాము' అని అన్నారు. పొరుగు దేశాలను అస్థిరపరిచి ప్రపంచవ్యాప్తంగా హత్యలను భారత్ ప్రేరేపించే ప్రయత్నం చేస్తోందని కూడా అన్నారు. భారత మీడియా కూడా బలోచ్ చర్యలను పొగుడుతూ కథనాలు ప్రచురిస్తోందని, ఇది భారత విధానాలకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. దీంతో, భారత్ పాక్ తీరును ఎండగడుతూ గట్టి రిప్లై ఇచ్చింది. అయితే, రైలును తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఇటీవల పాక్ ఆర్మీ పేర్కొంది. ఆపరేషన్ ముగిసినట్టు వెల్లడించింది. అయితే, బలోచ్ ఆర్మీ మాత్రం ఈ ప్రకటనను తోసి పుచ్చింది. బలోచిస్థాన్‌లో జరిగిన రైలు హైజాక్ ఘటనపై పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి షఫ్ఖత్ అలీఖాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. పొరుగుదేశాల్లో అస్థిరత నెలకొల్పేందుకు ప్రయత్నిస్తూ, ప్రపంచవ్యాప్తంగా హత్యాకాండకు పాల్పడుతోందని అన్నారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందినీ హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. రైలు హైజాక్ వెనక అఫ్గానిస్థాన్ హస్తం ఉందనేందుకు తమవద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పాక్ విదేశాంగ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపై అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది.

# సింహాచలంలో వైభవంగా డోలోత్సవం

**సింహాచలం,మార్చి14:** విశాఖపట్నం జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అప్పన్న స్వామి పెళ్లి చూపులు ఉత్సవం, డోలోత్సవం సంప్రదాయ బద్ధంగా జరిగాయి. అర్చకులు స్వామి, అమ్మవార్లను సింహగిరి పైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకొచ్చారు. పుష్కరిణి ఉద్యాన మండపంలో దేవతామూర్తులను ఉయ్యాలలో అధిష్ఠించి చూర్ణోత్సవం, వసంతోత్సవం, ఉయ్యాల సేవలు నిర్వహించారు. అప్పన్న స్వామి సోదరి, పైడితల్లి అమ్మవారి కుమార్తెతో స్వామికి పెళ్లి కుదిరిన సందర్భంగా అర్చకులు, గ్రామస్థులు ఆనందోత్సాహాల నడుమ రంగులు చల్లుకొని వేడుకలు నిర్వహించారు. డోలోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామ తిరువీధి మహోత్సవం కనుల పండువగా సాగింది. ఏప్రిల్ 8న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవం, రథోత్సవం వైభవంగా జరగనున్నాయి.

# అమరవీరుల ఆశయాల కొనసాగింపుకై
# ప్రజా సమస్యలపై మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించాలి

**సీపీఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపు. - కరీంనగర్‌లో ఘనంగా అనభేరి 77వ వర్ధంతి.**




**కరీంనగర్ మార్చ్ 14 :**
భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం,అణగారిన వర్గాల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట అమరవీరుల ఆశయాలను కొనసాగించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ.సీపీఐ శ్రేణులు మరింత పట్టుదలతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్ రావు 77వ వర్ధంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ ముందు గల అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తో కలిసి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నవాబుల పరిపాలన సమయంలో ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తూ, వెట్టి చాకిరి చేయించుకుంటూ, ప్రజలను బానిసలుగా చూసే రోజుల్లో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్ రావు తన చిన్నతనం నుండే ఎదిరించే స్వభావాన్ని కలిగి ఉన్నాడని, ఆనాటి పరిస్థితులను అంచనా వేసి పేదల కోసం నిజాం పరిపాలకులను,వారి తాబేదారులైన రజాకార్లను,దేశ్ ముఖ్ లను ఎదిరించడానికి ఆంధ్ర మహాసభలో చేరి ప్రజలను చైతన్యపరచాడని, దున్నేవానికి భూమి కావాలని, వెట్టిచాకిరి విముక్తి కావాలని 1947 సెప్టెంబర్ 11న ఆనాటి ఆంధ్ర మహాసభ,కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులైన రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి మఖ్దూమ్ మోహియుద్దీన్ లు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునివ్వడంతో ఆ పిలుపుని అందుకొని అనభేరి ప్రభాకర్ రావు,సింగిరెడ్డి భూపతిరెడ్డిల తో పాటు మరొక పదిమంది దళం నిజాం నవాబులపై,రజాకారులపై వీరొచితంగా పోరాటం నిర్వహించారని,1948 మార్చి 14న మాందాపూర్ గుట్టల్లో భోజనం చేస్తున్న వారిపై రజాకార్ల పోలీసు మూకల కాల్పుల్లో అనభేరి ప్రభాకర్ రావు,భూపతి రెడ్డి తో పాటు మరో పది మంది వీరమరణం చెందారని, ప్రజల కోసం పనిచేసే అమరత్వం పొందిన అమరవీరుల ఆశయాలను కొనసాగించడం కోసం కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు,పోరాటాలు నిర్వహించాలని, అమరవీరులు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాద బిజెపి పార్టీ వక్రీకరిస్తుందని వారి మాటలను తిప్పికొట్టేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆనాడు సాయిధ పోరాటమే సీపీఐ నిర్వహించకపోతే నేటి తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా ఉండేవని, నిజాం నవాబుల కింద బానిసలుగా ఉండేదని, రజాకార్లు, దేశ్.ముఖ్ ల ,పటేల్ పట్వారి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్ర ఫలమని వెంకటస్వామి అన్నారు.అనభేరి ప్రభాకర్ రావు తో పాటు సింగిరెడ్డి భూపతిరెడ్డి లాంటి అమరవీరుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, రానున్న భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా పాలక ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ పొనగంటి కేదారి గారు, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి,బోయిని అశోక్,కసిరెడ్డి సురేందర్ రెడ్డి,గూడెం లక్ష్మీ,టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికారెడ్డి బుచ్చన్న యాదవ్,పైడిపల్లి రాజు ,పిట్టల సమ్మయ్య,నాలువాల సదానందం, బోనగిరి మహేందర్,న్యాలపట్ల రాజు వీరితో పాటు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

# నేలవిడిచి సాము చేస్తున్న పాలకులు !





నేల విడిచి సాము చేయడం..ఓట్ల కోసం పథకాలను చేపట్టడం..పాత పథకాలను కొనసాగించడం తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ముందుకు వెళ్లాలన్న ఆలోచన కానీ, ప్రణాళిక కానీ తెలుగు రాష్ట్రాలను ఏలుతున్న పాలకుల్లో కనపించడం లేదు. ఎంతసేపు కొత్త పథకాలు ప్రకటించడం, నిధులు లేక చతికిలపడడం చూస్తున్నాం. డబ్బుల దుబారాను అరికట్టలేక పోతున్నారు. దుబారా పథకాలను తగ్గించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు ఎవరికి ఎవరూ తీసిపోవడం లేదు. గతంలో పాలించిన జగన్, కెసిఆర్‌లు కూడా అదే చేసారు. ఉట్టికెగరలేని వాడు ఆకాశానికి ఎగిరినట్లు అన్న చందంగా వీరి పాలన ఉంటోంది. గ్రామాల్లో మంచినీటి సదుపాయం, సాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు వేయడం, స్కూళ్లు, ఆస్పత్రులను పటిష్టం చేయడం వంటి ప్రాథమిక అవసరాలను పక్కాగా చేయడంలో పాలకులు విఫలం అవుతూ వస్తున్నారు. కోతుల బెడద విపరీతంగా ఉన్నా అటవీశాఖ చేష్టలు ఉడిగి చూస్తోంది. ఆదాయ వనరులను లెక్కవేయకుండా, అదేపనిగా అప్పులు చేస్తూ వడ్డీలు కడుతూ, రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచితబస్సు,పెన్షన్లు అభివృద్ధి సూచికలు కాదని గుర్తించాలి. ప్రజలకు తాయిలాలు వేయడమెలా అన్న దారిలోంచి పక్కకు రావాలి. ప్రజలు కూడా ఉచితాల వలలో పడి దరిద్రాలను కొనితెచ్చుకుంటున్నారు. గతంలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, కుటుంబ పాలన చేసిన కెసిఆర్ కూడా నీతులు వల్లిస్తున్నారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకొని ఇప్పుడు గోసపడుతున్నారని ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రజలందరూ తన పాలనకోసం చూస్తున్నారని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఎపిలో అయితే బటన్లు నొక్కడం ద్వారా ప్రజలకు డబ్బు పంచాను. అయినా నన్ను ఎందుకు ఓడించారో అర్థం కావడంలేదని జగన్ వాపోయారు. ఈవీఎంల ద్వారా ఏదో గోల్‌మాల్ చేసి ఉంటారని తన అసమర్థతను అలా చాటుకున్నారు. ఈవీఎంలను మేనేజ్ చేసి ఉంటారని 2019లో ఓటమి అనంతరం చంద్రబాబు కూడా వ్యాఖ్యానించారు. తాము బాగు చేశామని అనుకోవడం కన్నా..ప్రజలు అనుకుంటున్నారా లేదా అన్నది ఆలోచచించడం లేదు. గ్రామాల్లో పచ్చదనం కరువయ్యింది. పశువులకు గ్రాసం దొరకడం లేదు. ఎండాకాలానికి ముందే మంచినీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామాల్లో కోతుల బాధ విపరీతంగా ఉంది. వీటి గురించి ఆలోచచించడం లేదు. డిలిమిటేషన్ సీట్లు, హిందీ వద్దనడం వంటి వాటిపట్ల కొందరు చేసే ఆందోళనకు మద్దతు పలకడం అలవాటు చేసుకున్నారు. ఎన్ని సీట్లు పెరిగినా ప్రజలకు ఒరిగేదేముంది. పార్లమెంట్ సీట్లు పెరిగితే మరింత ఖాజానా భారం తప్ప ప్రజలకు వచ్చే లాభం లేదు. అధికారంలో ఉన్నప్పుడు తాము ఏ తప్పూ చేయ లేదని, ప్రజలే తమను ఓడించి తప్పు చేశారని ప్రాంతీయ పార్టీలకు నాయకలు చేస్తున్న వ్యాఖ్యలు వారి అహంకారానికి నిదర్శనంగా చూడాలి. అధికారంలోకి వచ్చినవారు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజలను దూరం పెడుతున్నారు. ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వడం లేదు. ప్రజావాణితో తెలంగాణలో అర్జీలు స్వీకరించడం ఓ ఫ్యాషన్‌గా మారింది. ప్రజల సమస్యలు పరిష్కారం అయినట్లు దాఖలాలు లేవు. ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయడం లేదు. ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు తెలుసుకోలేక పోతున్నారు. పాలన అంటే పందేరాలు, పెన్షన్లు, రేషన్ కార్డులే అనుకుంటు న్నారు. వీటికోసం వేలకోట్లు తగలేసి అప్పులు చేస్తున్నారు. దీంతో అభివృద్ధి అన్నది కానరావడం లేదు. తమ హంగూ,ఆర్భాటాలు, రక్షణ, జీతాలు, పెన్షన్లకు వేలకోట్లు తగలేస్తున్నారు. ప్రజల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసి పోతుంది. కర్ణాటకలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ రాష్ట్రంతో సంబంధం లేని వాళ్ళు కూడా ముందే చెప్పారు. బిజెపి కూడా పాలనలో మార్పు చూపించలేకపోతున్నది. జిఎస్టీ వసూళ్లు ప్రజల నడ్డి విరుస్తున్నా పట్టించుకోవడం లేదు. తన పాలన పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తితో ఉన్నారని చంద్రబాబు ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. రేవంత్ రెడ్డి కూడా అదే చేస్తున్నారు. గత అనుభవాలను విస్మరించి ఇప్పుడు మళ్లీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని కలవరిస్తున్నారు. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వల్లెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో చంద్రబాబుకే తెలియాలి. ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి సంతోషంగా ఉండేందుకు ప్రతి ఆదివారం అమలు జరిగేలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొంతమంది మినహా మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం కూడా అధికంగా ఉండటం లేదు. చంద్రబాబు పాలనలో నిరంతర సమీక్షల వల్లనే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అధిక ఒత్తిడికి గురవుతారన్న విషయం తెలుసుకోవడం లేదు. ఇకపోతే సమీక్ష చేసిన అంశం అమలువుతుందా అన్న పరిశీలన లేదు. క్షేత్రస్థాయికి దానిని తీసుకుని అమలు చేశారా అంటే అదీ లేదు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101